క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఎనీమియా నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): మంచి ఆహారంతో పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చునని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. మంచి ఆహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల్లో ఎనీమియాను తగ్గించవచ్చన్నారు. స్థానిక వెంకటాపురం-1 సెక్టార్ లంబాడీ పేటలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం అందించి ఎనీమియా రాకుండా చూడవచ్చని తెలిపారు. బాలింతలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యనారాయణమ్మ, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలో గణపతి ప్రతిమల నిమజ్జనం కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆముదాల అప్పల స్వామి కాలనీ, మహేశ్వర కాలనీ, కైకలూరు బైపాస్ రోడ్డు, వంగాయగూడెం, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి నిమజ్జన కార్యక్రమం ముగిసే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ల నియామకం

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలోని ప్రతి మండలానికి స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్టు ఎంపీడీఓ ఆర్ బేబీశ్రీలక్ష్మి శనివారం తెలిపారు. కొయ్యలగూడెం మండలానికి స్పెషల్ ఆఫీసర్‌గా డీఎల్‌డీఓ ఎం.రాజు, బుట్టాయిగూడానికి ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఈఈ, పోలవరానికి ఎస్‌డీసీ విజిలెన్స్, టి.నరసాపురం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్, కుకునూరుకు ఏడీ అగ్రికల్చర్, వేలేరుపాడుకు ఐటీడీఏ ఏపీఓ, జీలుగుమిల్లికి జంగారెడ్డిగూడెం డీఎల్‌డీఓలను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు పేర్కొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

భీమడోలు: కొల్లేరు వరదల వల్ల ఆక్వా చెరువులు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భీమడోలులో శనివారం సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలుగు ఉన్నంత వరకు గురజాడ సజీవుడే

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : తెలుగు భాష, సాహిత్యం ఉన్నంత వరకు మహాకవి గురజాడ సజీవుడే అని నగరానికి చెందిన యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి తోట ఎడ్వర్డ్ అన్నారు. శనివారం గురజాడ జయంతి కార్యక్రమం స్థానిక విద్యానగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎడ్వర్డ్ మాట్లాడుతూ కన్యాశుల్కం వంటి ఒక్క రచనతో సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేయడంలో గురజాడ సఫలీకృతమయ్యారన్నారు. సాంఘిక దురాచారాలను, అవిద్య వల్ల స్త్రీలకు జరిగే అన్యాయాలను తన రచనల ద్వారా ప్రశ్నించిన ధీశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కె.జ్యోతి, ఎన్ దాసు, తోట సుధీర్, టి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

సంఘ సంస్కరణకు, సాహిత్య సంస్కరణకు గురజాడ తన రచనల ద్వారా తగిన మార్గం చూపారని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు

అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యఅతిథి దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం మననం చేసుకుంటూ వాటిని సాధించేవరకు విశ్రమించకూడదని సూచించారు. విశిష్ట అతిథి డాక్టర్ పెరియార్ మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం ద్వారా వారి సంస్కారాన్ని మనం అలవర్చుకోవచ్చన్నారు. తెలుగు విభాగం అధ్యాపకులు ఎస్ పరమేశ, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గురజాడ జీవితం ఆదర్శం

గురజాడ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు కేఏ రామరాజు అన్నారు. సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గురజాడ జయంతి కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ గురజాడ కవిగా, సంఘ సంస్కర్తగా సమాజంలో ఉన్న సాంఘిక అసమానతలను రూపుమాపడానికి కృషి చేశారని అన్నారు. ప్రధాన వక్త, తెలుగు శాఖాధిపతి మేడసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాడ ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్త, చిరస్మరణీయుడని, ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం ఈనాటికీ సమాజానికి స్ఫూర్తి దాయకమని, ఆయన రచనల్లో పాత్రలు, సన్నివేశాలు సాహిత్యకారులకే కాక ప్రజలందరికి మార్గదర్శకమని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ జి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.శంకర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో ఇబ్బందులను తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల అప్డేట్ చేసిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్‌లోనే విద్యార్థుల మార్కులను నమోదు చేసే అవకాశాన్ని పొందుపరచడం వల్ల మార్కులను మొబైల్ ఫోన్లోనే నమోదు చేయాల్సి వస్తోందని, కంప్యూటర్‌లో లేదా లాప్‌టాప్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర పేర్కొన్నారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల మార్కులు ఒకేసారి నమోదు చేసే అవకాశం లేకుండా ఒక సబ్జెక్టును ఎంచుకొని మార్కులు నమోదు చేసి, మరలా వెనక్కివచ్చి వేరొక సబ్జెక్టు మార్కులను నమోదు చేయాల్సి వస్తుందని, దీంతో ఒక్కో విద్యార్థి మార్కులు నమోదు చేయడానికి 20 నుంచి 30 నిమిషాల వరకు సమయం పడుతుందని వివరించారు. తరగతి ఆధారంగా కాకుండా గతంలో వలే సబ్జెక్ట్ ఆధారంగా ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసే అవకాశం కల్పించాలని కోరారు.

రాజకీయ విమర్శలకు వేదికగా శ్రీవారి ఆలయం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని కొన్ని సంస్థలు రాజకీయ విమర్శలకు వేదికగా చేసుకోవడం భక్తులను విస్మయానికి గురి చేసింది. హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు శనివారం ఉదయం స్వామి వారి సన్నిధిలో భక్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా సంఘాల నాయకులు ఆధ్యాత్మికానికి సంబంధించిన అంశాలు చెబుతారని భావించారు. అయితే నాయకులు తిరుమల తిరుపతి లడ్డూలో ఆవు నెయ్యికి బదులు, జంతువుల కొవ్వు వంటి పదార్థాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వినియోగించారని వస్తున్న దుష్ప్రచారాన్ని కొనసాగింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు భక్తులు అర్థం చేసుకున్నారు. తిరుపతి లడ్డూలో ఎటువంటి జంతువుల కొవ్వు వినియోగించలేదని, దీనిపై సీబీఐ విచారణ చేయించి నిజాలు నిర్ధారించాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి వంటి వారు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా పచ్చ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తోందని, పచ్చ మీడి



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ సంఘాల నాయకులు

యాలో తాము కూడా కనిపించాలనే ఉద్దేశంతోనే కొన్ని సంఘాల నాయకులు ఇటువంటి దుష్ప్రచారాలను కొనసాగిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా రాజకీయ విమర్శలు చేసుకోవడానికి ఇటువంటి సమావేశాన్ని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. హిందూ సంఘాలైనంత మాత్రాన ఆలయాల్లో ఇటువంటి సమావేశాలకు ఎలా అనుమతి ఇస్తారని నిలదీస్తున్నారు. ఇటువంటి రాజకీయ సమావేశానికి అనుమతి ఇచ్చి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన కార్యనిర్వహణాధికారిపై విచారణ చేపట్టి శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కొత్తపేటలో గణేశుని నిమజ్జనాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 43వ డివిజన్, సబ్బవరపు వారి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రుల మహోత్సవాలు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం స్వామివారి నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ట్రాక్టర్ వాహనానికి పుష్పాలు, మామిడి తోరణం, స్వామి వారి జెండాలతో అలంకరించి స్వామి వారి విగ్రహాన్ని అధిష్ఠింపజేశారు. భక్తులు నగర వీధులలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి నిమజ్జన యాత్ర నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలి వెళుతున్న గణపయ్య

శ్రీరామ్‌నగర్‌ను ముంచిన వాన

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ఏలూరు రూరల్ : శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి శనివారపుపేట శ్రీరామ్‌నగర్ మళ్లీ మునిగింది. ఒకటో రోడ్డు నుంచి ఐదో రోడ్డు వరకు వర్షపునీరు డ్రెయినేజీలో పొంగి పొర్లింది. లోతట్టు ఇళ్లలోకి నీరు చేరి నివాసితులను ఇక్కట్లకు గురి చేసింది. పురాతన డ్రెయినేజీ వ్యవస్థను చేయాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. పురాతన డ్రెయినేజీ వ్యవస్థ

కారణంగా శ్రీరామ్‌నగర్‌లో వర్షపునీరు వేగంగా కిందకు పారడం లేదు. డ్రెయినేజీ తూరలు నిండా మట్టి పేరుకుపోయింది. ఫలితంగా చిన్న వర్షం వచ్చినా డ్రెయినేజీలో నీరు రోడ్లపైకి ఎగదన్నింది. ఖాళీ స్థలాలు, ఇళ్లను ముంచింది. దీనికితోడు డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు ఇళ్లలోనికి చేరింది. దీంతో మహిళలు గంటల పాటు శ్రమించి ఇళ్లు, వాకిళ్లను శుభ్రం చేసుకున్నారు. ఏటా వర్షాకాలం మూడు నెలలు ఈ సమస్యతో అగచాట్లు పడుతున్నామని నివాసితులు వాపోయారు. మరో పక్క డ్రెయినేజీ ముఖద్వారం చెరువులో చెత్తాచెదారం పెరిగిపోవడం వల్ల సమస్యలు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వర్షాలతో మురుగు నీరు ఇళ్లను ముంచిందని గుర్తు చేశారు.

కమిషనర్ వచ్చినా ఫలితం లేదు

నాటి కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటించి వెళ్లినా ఫలితం లేదని స్థానికులు గుర్తు చేశారు. అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది తాత్కాలిక పనులు పూర్తి చేసి వెళ్లిపోయారని తెలిపారు. ఫలితంగా మళ్లీ వర్షపునీరు రోడ్డుపైకి చేరి ఇక్కట్లకు గురి చేస్తోందని మహిళలు వాపోయారు. ఇప్పటికైన కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి శాస్వత ప్రాతిపదికన శ్రీరామ్‌నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన చేయాలని కోరుకుంటున్నారు.



శ్రీరామ్‌నగర్ 5వ రోడ్డులో ఇంటిని చుట్టుముట్టిన వర్షపునీరు



శ్రీరామ్‌నగర్‌లో రోడ్డుపై చేరిన వర్షపునీరు



చెరువులో పేరుకుపోతున్న చెత్తా చెదారం

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: నగరంలోని పలువురు కుటుంబాలను వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ శనివారం పరామర్శించారు. రెల్లి సంఘం నాయకులు ధనియాల ఈశ్వర్ సతీమణి లలితాదేవి ఇటీవల మరణించారు. ఈశ్వర్ ఇంటికి వెళ్లిన ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈశ్వర్ సతీమణి ఆకస్మిక మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

● ఏలూరులోని ప్రముఖ పొగాకు వ్యాపారవేత్త తీరండి రమణరావు సతీమణి కనకరత్నం మరణించారు. రమణరావు కుటుంబాన్ని జయప్రకాష్ పరామర్శించి, తమ సంతాపాన్ని తెలిపారు. ఆ కుటుంబానికి ఎప్పుడూ తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌పీ శివరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్, యల్లాపు మోజెస్, రావి సునీల్, ఎస్సీ నాయకులు సొంగా మధు, నేతల కిట్టు, వికాస్ తదితరులు ఉన్నారు.



వ్యాపారవేత్త రమణరావును పరామర్శిస్తున్న జయప్రకాష్



ఈశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జయప్రకాష్

సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో సెల్‌ఫోన్ చోరీలు పెరిగిపోతున్నాయి. గతంలో బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో, రైతుబజార్ల వద్ద రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యేవి. తాజాగా 'మీ వస్తువులు పడిపోయాయి' అంటూ చెబుతూ అవి చూసేలోపే జేబులో నుంచి ఫోన్లు కాజేస్తున్నారు. శనివారం ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఉద్యోగి లోనికి వెళుతుండగా ఇద్దరు యువకులు అక్కడ కాపుకాచి ఆయనతో మాట్లాడారు. ఇక్కడ ఏదో వస్తువు కిందపడిపోయిందని చెప్పారు. ఆ ఉద్యోగి కిందకు చూస్తుండగానే జేబులోనుంచి సెల్‌ఫోన్‌ను తీసుకుని మోటారుసైకిల్‌పై ఇద్దరు పరారయ్యారు. ఇదే తరహాలో ఏలూరు నగరంలో మరోచోట సెల్‌ఫోన్ చోరీ చేసినట్టు పోలీసులు చెబుతున్నారు.

యువకుడికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తాడువాయిలో ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జీలుగుమిల్లి మండలం టి.గంగన్నగూడెం గ్రామానికి చెందిన తాటి ప్రవీణ్ కుమార్ మంగళవారం తన ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. తాడువాయిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఢీకొట్టి కింద పడిపోయాడు. దీంతో ప్రవీణ్ కుమార్ తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్ జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు ఏలూరు రిఫర్ చేశారు.

లంబాడ సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



కృష్ణా నాయక్



రాజాబాబు నాయక్

చింతలపూడి: ఎస్టీ బంజారా సుగాలి (లంబాడ) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుగ్గులోతు కృష్ణా నాయక్, ప్రధాన కార్యదర్శిగా ధారావతు రాజాబాబు నాయక్ ఎన్నికయ్యారు. శనివారం వారు మాట్లాడుతూ లంబాడ గిరిజనులకు సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. రాజకీయంగా లంబాడా గిరిజనులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని, ఫిబ్రవరి 14న సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు



బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, ఈ సమస్యను అరికట్టేందుకు అవగాహన, విద్య అవసరమని ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అన్నారు. సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక అవగాహనా కార్యక్రమం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరావు మాట్లాడుతూ విద్య, నైపుణ్యాలు బాలికలను శక్తివంతం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాము, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎ.లావణ్య, అడిషనల్ కోఆర్డినేటర్ జి.లక్ష్మీ సరస్వతి, సభ్యులు సీహెచ్ శ్రీదేవి, కె.అనురాధ, పి.పావని, చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్, కమ్యూనిటీ సోషల్ వర్కర్ జి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి దర్శనార్థం క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశ ఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.20 కోట్ల సెస్ బకాయిలు

భీమడోలు: జిల్లా గ్రంథాలయ సంస్థకు వివిధ శాఖల నుంచి రూ.20 కోట్ల సెస్ బకాయిలను రావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయంలోని రికార్డులు, రిజిస్టర్లును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పుస్తక వర్గీకరణ చేసిన విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.20కోట్ల బకాయిలుండగా వాటిలో ఏలూరు మునిసిపాలిటి రూ.9కోట్లు, గ్రామ పంచాయతీల నుంచి రూ.9 కోట్లు, ఇతర మునిసిపాలిటీల నుంచి రూ.2 కోట్ల సెస్ బకాయిలు సంస్థకు చెల్లించాల్సి ఉందన్నారు. సకాలంలో సెస్‌ను సంస్థకు చెల్లించడం ద్వారా సంస్థ బలోపేతమవుతుందన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మండే సుధాకర్‌లు ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు.



భీమడోలు శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

హైస్కూల్లో తనిఖీలు

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ శనివారం పరిశీలించారు. వంటశాలలోని వసతులను, వంటకాలు, మంచినీటి సదుపాయాన్ని పరిశీలించారు. విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. మంచి ఆహారాన్ని అందిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, చదువులో రాణిస్తారనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో నీటి శుద్ధి యంత్ర సామగ్రి వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని విజయకృష్ణ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	72	చిక్కుడు కాయలు	68-142
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	8
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	60-100
బెండకాయలు	32	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	38
కాకర కాయలు	34-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	40-60	పాలకూర	15
దొండకాయలు	48	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58